మూషికాలపై యుద్ధం చేయాల్సిందే

- ఎలుకల నివారణతో దిగుబడులు అధికం
- సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి
- తెనాలి ఏడీఏ ఉషా రాణి రైతులకు సూచనలు


వివరిస్తున్న తెనాలి ఏడీఏ ఉషా రాణి, ఏవో వెంకటరావు

కొల్లిపర: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగులో ఉన్న వరి పంటను ఎలుకలు తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఎలుకల పై నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాలోని రైతులు నిఘా ఉంచాలని, గట్ల సంఖ్యను, పరిమాణాన్ని వీలైనంత వరకు తగ్గించడం ద్వారా ఎలుకల నివాస స్థావరాలను తగ్గించవచ్చని తెనాలి ఏడీఏ ఉషా రాణి, ఏవో కె.వెంకటరావు సచిస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు సామూహికంగా ఎలుకల నివారణకు ప్రభుత్వం ఉచితంగా బ్రోమోడేయాలిన్ అనే విషపు ఎరమందు అందిస్తోంది. అయితే ఈ మూషికాలపై సామూహికంగా యుద్ధం చేసే నివారించేందుకు సలహాలు సూచనలు అందించారు.

బ్రోమోడేయాలిన్ విషపు ఎర మందు ఇలా

బ్రోమోడేయాలిన్ అను విషపు ఎరమందు వాడేటప్పుడు విషం కలుపని ఎర ద్వారా ఎలుకలను మచ్చిక చేయనవసరం లేదు. ఈ ఎరను 10–15 గ్రాముల(96 శాతం నూకలు, 2 శాతం నూనె, 1 శాతం మందు) పొట్లాలుగా కట్టి కన్నం లో ఒకటి చొప్పున పెట్టాలి. సజీవ ఎలుక బొరియలలో పది రోజుల వ్యవధితో పైరు చిరు పొట్ట దశకు వచ్చే వరకు రెండు మూడు సార్లు వాడవచ్చు.

ఎర స్థావరాలు

బ్రోమోడేయాలిన్ ఎరను సరైన స్థావరాలను ఏర్పాటు చేసుకుని వాడకం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చు. ఎకరానికి 5–6 పీవీసీ పైపు ఎర స్థావరాలను (3 అంగుళాల వ్యాసం , 1.5 అడుగు పొడవు) పొలానికి నాలుగు మూలల గట్లపై అమర్చుకోవాలి. వీటిలె బ్రోమడయోలోన్ ఎర మందు 30 గ్రాముల చొప్పున వేసి, వారానికి రెండు సార్లు తయారుచేసిన ఎర మందును మార్చుకోవాలి. ఈ పద్ధతిని వరి నాట్లు వేసిన దగ్గర నుంచి చిరు పొట్ట దశ వరకు అవలంబించాలి. ఇటువంటి ఎర స్థావరాల్లో ఉంచిన విషపు ఎర ఎండ, వానలకు పాడవ్వకుండా ఉండడమే కాకుండా పెంపుడు జంతువులకు, పక్షులకు అందుబాటులో ఉండదు. కావున వాటికి ఏ విధమైన హాని జరగదు. ఈ ఎర స్థావరాలను అమర్చి ముందుగా విత్తిన వరి నారుమళ్లను కూడా ఎలుకల బారి నుంచి సమర్థవంతంగా కాపాడుకోవచ్చు.

పొలం గట్లు ఇలా బాగు చేసుకోవాలి

పొలం గట్లపై గడ్డి , కలుపు లేకుండా శుభ్రపరుచుకోవాలి. గట్లను పదునైన పారతో చెక్కుకోవాలి. ఎలుకల బుట్టలను నారుమడి పోసిన దగ్గర నుంచి దమ్ములు పూర్తయిన తర్వాత నాట్లు వేసిన ఇక నెల వరకు కోతల తర్వాత ఎకరానికి 20 చొప్పున పెడితే వలస వచ్చే , పోయే ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చు. పంట లేని సమయంలో ఎలుకల నివారణ చేపడితే వాటి సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చు. ఆ సమయంలో ఎలుకలకు కావాల్సిన ఆహారం తక్కువగా దొరకడంతో ఎరను తినడానికి ఆవకాశం ఎక్కువగా ఉంటుంది. పంట కాలంలో విషపు ఎరలను చిరు పొట్ట దశ ఏర్పడకు ముందే ఉపయోగించాలి.

జింకుఫాస్ఫైట్ ఎర ఇలా

ఎలుకల ఉధృతి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు పంట కాలంలో ఒక్కసారి మాత్రమే జింకు ఫాస్ఫైట్ ఎరను వాడాలి. దీనికి ముందుగా విషంలేని ఎరను 20 గ్రాములు (98 శాతం నూకలు, 2శాతం నూనె) పొట్లాలుగా కట్టి కన్నానికి ఒకటి చొప్పున పెట్టి రెండు రోజుల ఎలుకలను మచ్చిక చేసుకోవాలి. మూడవ రోజు జింకు ఫాస్ఫైడ్ ఎరను 10 గ్రాములు (96 శాతం నూకలు, 2శాతం నూనె, 2 శాతం మందు) పొట్లాలు కట్టి కన్నంలో ఒకటి చొప్పున వేయాలి.

పొగబారించే యంత్రం ద్వారా ఇలా

పంట ఏ దశలోనైనా ఎలుకల కన్నాలలో పొగను బర్రోఫ్యూమిగేటర్ మందు ద్వారా వదిలి సులువుగా చంపవచ్చు. పొగను వదిలేటప్పుడు కన్నం చుట్టూ ఉన్న పగుళ్లను మట్టితో మూసివేసి, పొగను కనీసం మూడు నిముషాలు వదలాలి. ఎలుకలు రసాయనిక ఎరలను స్వీకరించని సమయాల్లో కూడా దీని ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. పంట ఈనిన దశలో పొగబారించడం ద్వారా ఒకే కన్నంలో వివిధ దశలలో ఉన్న ఎలుకలను , చూడు ఎలుకలను నిర్మూలించి తదుపరి సీజన్‌లో వాటి ఉధృతిని తగ్గించవచ్చు.

క్లుప్తంగా

పోలీసు విధులపై అవగాహన



మంగళగిరి: పట్టణంలోని ఆరవ బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ ఆయుధాల గురించి వివరించి, వాటి వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్లు డి.వెంకటేశ్వర్లు, పటాలం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై వినతి



తాడేపల్లిరూరల్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం దుగ్గిరాల తహసీల్దార్ సునీతకు వినతి పత్రాన్ని అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచమని, నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేస్తామని చెప్పని కూటమి నేతలు.. 2022–23 సంవత్సరం సర్దుబాటు చార్జీలు (ట్రూ అప్ చార్జీలు) పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని మోపిందని చెప్పారు. ఇప్పటికే ప్రజలు ఉపాధి లేక పనులు లేక అవస్థలు పడుతుంటే ఇప్పుడు కరెంటు చార్జీలను పెంచి మరింత భారం మోపిందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు ఎలా జీవిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై. బ్రహ్మేశ్వరం, సీహెచ్ పోతురాజు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ డోలాస్ నగర్‌లో ఉన్న గుడ్ షెపర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. కాన్వెంట్ సూపీరియర్ సిస్టర్ ఉదయ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల కారణంగా ముంపుకు గురైన సుమారు 900 మంది వరద బాధితులకు తమవంతు సాయంగా 10కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో గోధుమ పిండి, కిలో పంచదార, కారం, పసుపు, సబ్బులు తదితర నిత్యావసర వస్తువులు పంపిణీచేశామని తెలిపారు. చాలీష్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లత, కరుణాలయ సిస్టర్ మనీషా, సిస్టర్‌స రూబీ, వసుంధర, పోతురాజు, కార్తీక్, నాగమణి, విజయ్ లక్ష్మి, సుకన్య, నాగలక్ష్మి, ప్రియ, ఫాతిమా పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



తాడేపల్లిరూరల్: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న సేవలకు ప్రజల తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మంగళగిరి జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి మోహనరావు అన్నారు. శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ దాదాపు రూ. 2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వే లైన్‌ను నిర్మించనున్నారని, దీనిలో భాగంగా 3.2కిమీ మేర కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జిని నిర్మించనున్నారని తెలిపారు. మచిలీపట్నం, కాకినాడ పోర్టులకు అనుసంధానం చేస్తూ అంగీకారం తెలియజేయడం, ఐటీ హబ్ ఏర్పాటు చేయడం సంతోషకర విషయమన్నారు. మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

భవన నిర్మాణ పనులు పూర్తి



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో కోటి లింగాల క్షేత్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో భవనంలో స్వాతంత్ర్య సమర యోధురాలు బీనాబాయి పేరిట వైద్యుడిని ఏర్పాటుచేసి ప్రాథమిక చికిత్స, ఉచితంగా మందులు అందజేస్తామని ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ తెలిపారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకులు బాబా ఆధ్వర్యంలో ఆలయం, ఉచిత వైద్య సేవలకు భవన నిర్మాణం కావించినట్లు వివరించారు.

మెప్మా బజార్ ప్రారంభం


ఉత్పత్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శకుంతల

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణుడు గుడి వద్ద శనివారం మెప్మా బజారును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కంఠమనేని శకుంతల విచ్చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి మెప్మా బజార్లు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలను అందించడమే కాకుండా రుణాలను పొందిన మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి వాటిని మెప్మా బజారుల ద్వారా అతి తక్కువ ధరలకే విక్రయించి, లాభాలను సాధించడం ద్వారా మహిళలు ఆర్థిక అక్షరాస్యతను సాధించవచ్చని అన్నారు. టీడీపీ నాయకులు మేకా పుల్లారెడ్డి, కొర్రపాటి విజయకుమార్, నక్కా నవీన్ రాజా, పోతాబత్తుని శ్రీనివాసరావు, సలాం, తోట సాంబశివరావు, హరికృష్ణ, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా ఎంపికలు


విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: నెల్లూరులో నవంబర్ 2, 3 తేదీల్లో జరుగనున్న అంతర జిల్లాల యోగా పోటీల ఎంపిక కార్యక్రమాన్ని శనివారం ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక వందే మాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ అండర్ 14 బాలబాలిక యోగా ఎంపికలకు ఉమ్మడి గుంటూరు జిల్లా 17 నియోజకవర్గాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పాఠశాల నుంచి బాలుర జట్టులో ఎస్కే షబ్బీర్ ఆలీ ఈ పోటీలకు ఎన్నికయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి. రమేష్‌బాబు, స్కూల్ పీఎంసీ చైర్మన్ తెనాలి కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా యువజన రైతు సంఘం అధ్యక్షుడు కళ్ళం రాజశేఖరరెడ్డి, గ్రామపెద్దలు కళ్ళం గోవిందరెడ్డి, యోగా టీచర్ కె.బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

గొడవర్రులో పొలం బడి


అవగాహన కల్పిస్తున్న ఏఓ శిరీష

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష వరి పంట పొట్ట దశలో ఉందని, పొలంలో తెగుళ్లు, దోమ బెడద గురించి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేశారు. వరి, మినుము పంటల్లో తెగుళ్ల నివారణకు సొంఠి పాలు కషాయం తయారీ విధానాన్ని వివరించి రైతులు ఏ విధంగా వినియోగించాలో వివరించారు. సైంటిస్ట్‌గా దిలీప్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని సొంఠి పాలు కషాయం తయారీని వివరించారు. ఈ విధానం వల్ల తక్కువ పెట్టుబడి, మంచి నాణ్యమైన పంటల దిగుబడి పొందవచ్చని రైతులకు తెలిపారు. ఐసీఆర్‌పీలు లక్ష్మి దుర్గ, జ్యోతి, మౌనిక, వీఏఏలు పవన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెం రోడ్డులో ఖాళీ కొబ్బరి బోండాల తరలింపు

ఎట్టకేలకు స్పందించిన మున్సిపాలిటీ


కొబ్బరి బోండాల తరలింపు

తెనాలి: మున్సిపల్ కంపోస్టు యార్డు కలిగిన పట్టణ బుర్రిపాలెంరోడ్డులో కొంతకాలంగా పట్టణంలో విక్రయిస్తున్న కొబ్బరి బోండాలను డంప్ చేస్తున్నారు. రోడ్డు పొడవునా వరుసగా వీటిని అన్‌లోడింగ్ చేస్తూ పోతున్నారు. రోడ్డు పక్కన విశాలమైన మార్జిను నిండిపోయి రోడ్డుపైకి కూడా ఖాళీ కొబ్బరిబొండాలు వచ్చేస్తున్నాయి. పలు విద్యాసంస్థలు, దాల్‌మిల్లులు కలిగిన ఆ రోడ్డులో బుర్రిపాలెం, చక్రాయపాలెం, చదలవాడ, అనంతవరం, చిలుమూరు, ఈపూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు స్కూల్‌బస్సులు, వ్యాపార లారీలు నిత్యం తిరుగుతుంటాయి. వాహనాల రద్దీ కలిగిన ఆ రోడ్డులో పట్టణం వెలుపల నుండి కిలోమీటర్ల పొడవునా ఖాళీ కొబ్బరి బోండాలతో రోడ్డు కుంచించుకుపోయింది. దీనిపై కొంత కాలంగా వస్తున్న విజ్ఞప్తులు కేంద్ర సహాయమంత్రి గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాలు...ఏవైనా గానీ మొత్తంమీద మున్సిపాలిటీ స్పందించింది. శనివారం రెండు డంపర్లు, మూడు పొక్లయిన్లతో కొబ్బరి బోండాలను తొలగించటం ఆరంభించారు. సాయంత్రం వరకు కొనసాగుతోంది. బయట ప్రాంతానికి వీటిని తరలిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన


అర్బన్ మార్కెట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న మహిళలు

తెనాలిఅర్బన్: మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు మున్సిపల్ మార్కెట్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న మెప్మా అర్బన్ మార్కెట్ శనివారంతో ముగిసింది. మార్కెట్‌లో స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన ప్రమీదలు, ఫ్యాన్సీ వస్తువులు, పిండి వంటలు, పచ్చళ్లు, జ్యూట్ బ్యాగ్‌లు, గాజులు, గోళ్ళ రంగులు, హెయిర్ రిబ్బన్స్, చీరలు, మొదలగు వంటి వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఉత్పత్తులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని మెప్మా సీఎంఎం విజయ, పలువురు ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ ఉచిత వధూవరుల పరిచయ వేదిక

తెనాలి: ఆంధ్రాప్యారిస్ బ్రాహ్మణ ఉచిత సమాచార కేంద్రం, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరు వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నారు. స్థానిక రామలింగేశ్వర పేటలోని మూల్పూరు సుబ్రహ్మణ్య కళ్యాణమండపంలో ఉదయం ఎనిమిది గంటల్నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వధూవరుల పరిచయం జరుగుతుందని అధ్యక్షుడు టి.దక్షిణా మూర్తి, కార్యదర్శి ఎన్వీ సత్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అవివాహితులైన బ్రాహ్మణ యువతీయువకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బీజేపీ సభ్యత్వం నమోదు

తెనాలిరూరల్: బీజేపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం స్థానిక నూకల రామ కోటేశ్వరరావు కళ్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేసి సభ్యత్వం ఇచ్చారు. కటారి వాసుదేవ నాయుడు, కడియాల నందకిషోర్, సీకా రవీంద్ర, క్రియాశీల సభ్యత్వ ప్రముఖులు కొవ్వూరు శ్రీనివాస్ యోగానంద కిషోర్, గాజుల వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెం తదితర ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు ఎర్రబాలెం గ్రామంలోని పెనుమాక రోడ్డు, ఎర్రబాలెం పారిశ్రామిక వాడలో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మికుల కష్టాలపై సీఎంకు లేఖ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని ఏసీసీ కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాసినట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కె. జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీసీ కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ 1993 మే 29న అక్రమ లాకౌట్ జరిగిందని, 32 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు నష్టపరిహారం అందలేదన్నారు. 333 మంది కార్మికులకు గాను 160 మంది మృతి చెందారని, కార్మికుల కుటుంబాలు దీనావస్థలో ఉన్నాయన్నారు. ఫ్యాక్టరీకి చెందిన భూములు అప్పట్లో రూ.10 కోట్లు విలువ చేసేవని, ఇప్పుడు సుమారు రూ.2 వేల కోట్లకు పైగా ఉన్నాయన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు కేవలం రూ.43 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయవలసినదిగా విజ్ఞప్తి చేస్తూ లేఖ రాసానని కె. జయరాం ఆ ప్రకటనలో తెలిపారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యురాలు ఆఫ్రిజ్ అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 167మందికి వైద్యురాలు ఆఫ్రిజ్ వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందించారు. చేతుల శుభ్రత, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం అరుణ, మేల్ అసిస్టెంట్ బాబురావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రవి

మేడికొండూరు: ఇరు వర్గాల మధ్య ఘర్షణలో వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు సిరిపురం గ్రామానికి చెందిన లామ్ రవిని గ్రామానికి చెందిన గోపీ అనే యువకుడు శుక్రవారం రాత్రి పుటుగా మద్యం సేవించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో రవి భార్య గోపిని ప్రశ్నించడంతో.. కోపద్రిక్తుడైన గోపి ఆమెపై కూడా దాడి చేశాడు. అడ్డుకున్న రవిపై గోపితోపాటు తల్లి, సోదరుడు రాజేష్ రవిపై దాడి చేశారు. దాడిలో రవికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. రవిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ధ్యాన విద్యార్థి' నాల్గవ సమావేశం


మాట్లాడుతున్న పిరమిడ్ మాస్టర్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమంలో ధ్యాన విద్యార్థి నాల్గవ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిరమిడ్ మాస్టర్లు కొసనం శ్యామలరావు, దేసు వెంకటరావు, దేసు వెంకట నాగలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి, మానసిక శక్తి, విజ్ఞాన శక్తి కలిగిన ధ్యాన విద్యార్థి అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సనాతన భారతీయ విజ్ఞానం, ధ్యానం సాధనతో బాలబాలికలు శక్తివంతమైన మానసిక శక్తి కలిగి ఉన్నతమైన జీవిత లక్ష్యాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కె. రంగనాయకరి, మంగళగిరి, పరిసర ప్రాంతాల ధ్యాన విద్యార్థి సెంటర్ల ఆచార్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ


కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న దాత దీపక్ జైన్ దంపతులు, రాయపాటి

తాడికొండ: తాడికొండ ఎస్‌వీవీ హైస్కూల్ విద్యార్థులకు గుంటూరుకు చెందిన కళ్లజోళ్ల షాపు అధినేత దీపక్‌జైన్ దంపతులు ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేశారు. 300 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు గతంలో నిర్వహించారు. వీరిలో 62 మందికి కంటి సంబంధిత లోపాలతో కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం పేద విద్యార్థులకు తమవంతు సహకారం అందించిన దీపక్‌జైన్ దంపతులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక కమిటీ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు, గోపిచంద్, విద్యా కమిటీ చైర్మన్ ఎం.రవి, హెచ్‌ఎం ఎ.వి.వి.వరప్రసాద్, ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండండి


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తెనాలిఅర్బన్: క్రీడా స్ఫూర్తిని అందరూ కలిగి ఉండాలని ప్రముఖ వ్యాపారి ఈదర వెంకటపూర్ణచంద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలి బోసురోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న వ్యాయామశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 300మంది క్రీడాకారులు దీనిలో పాల్గొన్నట్లు చెప్పారు. అనంతరం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ నిర్వాహకులు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, కె.శ్రీనివాసరావు, సుమన్, కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పందులను రోడ్లపై వదలొద్దు


పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: పందులను రోడ్లపై వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి హెచ్చరించారు. 29,30,31,32 వార్డులలోని పందుల పెంపదారుల వద్దకు శనివారం వెళ్ళి వారితో మాట్లాడారు. వార్డుల్లో తిరుగుతున్న పందులను తక్షణమే శివారు ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పందులపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయని, అవిరాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెంపకందారులపై ఉందన్నారు. అనంతరం ఆయా వార్డులోని పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.